

# తోడొకరుండిన....

## - శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

**రేణుక** ఇంటికెళ్ళింది కుసుమ. "అంకుల్, మీ దగ్గర ఒక డౌట్ క్లియర్ చేసుకుందామనుకుంటున్నాను."

"చెప్పమ్మా. నాకు తెలిసినదైతే తప్పకుండా చెప్పుతాను."

తనను మనసులో బాధిస్తున్న సునంద సమస్య వివరించింది.

"ఈ సమయంలో ఇట్లా వుండటం నాచురల్ అంటున్నారు. నిజమేనా?" ఆయన కొంత తడవు ఆలోచించాడు. కూతురు ద్వారా కొంత, వాళ్ళ ఇంటికి వస్తూపోతూ కొంత ఆయనకు సునంద గురించి తెలుసు.

"అది కూడా అయి వుండవచ్చు. నెలలు నిండుతున్న కొద్దీ గాభరా వుంటుంది. కాకపోతే ఇక్కడ సునందకు ఇంకో సమస్య కూడా వుందనిపిస్తున్నది." ఆ సమాధానం కోసమే ఎదురు చూస్తున్నట్టు కుసుమ ముందుకు ఆరాటంగా వంగి,"ఆ సమస్య ఏమై వుండొచ్చు అంకుల్?"

"అత్తింట అందరూ ఎంత ఆప్యాయంగా చూసుకున్నా కూడా ఈ సమయంలో ముఖ్యంగా మొదటి కాన్పు సమయంలో తనవారు అంటే పుట్టింటి వారు వుండాలని కొంతమంది కోరుకుంటారు.

అందుకే మొదటి పురుడు పుట్టింట్లో జరగాలంటారు. అత్తింటి వాళ్ళకు చెప్పుకోలేని విషయాలు పుట్టింటి వాళ్ళకు చెప్పుకుంటారు అమ్మాయిలు. ఎంత నిరాదరణకు గురైనా ఆ అమ్మాయికి నాయనమ్మ కాని మేనత్త మేనమామలు కాని దగ్గర వుండాలని అనిపిస్తున్నదేమో!

అదీ కాక సీమంతం కూడా చేయబోతున్నరని అంటున్నారు కదా! తనకు పుట్టింటి వారు ఎవరూ లేరని దిగులు పడుతున్నదేమో? అయినా ఆమె అత్తగారు సునంద పుట్టింటి వాళ్ళకు కబురు పంపారో లేదో?"

మిత్ర బృందం మంత్రాంగం మొదలెట్టింది.

"పూర్ణిమా మాటల మధ్యలో మీ అమ్మను అడుగరాదూ, సునంద పిన్ని వాళ్ళ వాళ్ళకు కబురెట్టారో లేదో?"

"లేదు కుసుమా. నాకు తెలిసి పెళ్ళయిన తరువాత వాళ్ళకు మాకు రాకపోకలు లేవు. పిన్ని కడుపుతో వున్న విషయం కూడా బహుశా తెలిసి వుండక పోవచ్చు. ఇంక సీమంతానికి వచ్చే ప్రసక్తి ఎక్కడి నుండి వస్తుంది?" నిస్పృహగా అంది పూర్ణిమ.

"నాయనమ్మ పెద్ద మనసుతో కోడలిగా తెచ్చుకుందే కాని పెళ్ళితూతూ మంత్రంగా చేసారని బాబాయికి అచ్చట్లు ముచ్చట్లు సరిగా జరగలేదని ఎక్కడో అసంతృప్తి మిగిలే వున్నట్టు తెలుస్తూ వుంటుంది. కాని నాయనమ్మ ఆ మాటలు సునంద పిన్ని ఎదుట ఏనాడు అనలేదు. పాపం అదొక వెర్రిబాగులది. వింటే బాధపడుతుంది అని కూడా అంటుంది. పాపం నాయనమ్మ. డబల్ మెంటాలిటీ."

"ఇంకేం తీగ దొరికింది. నెమ్మదిగా డొంకంతా లాగుదాము."

"ఏయ్ కుసుమా! ఏం చేద్దామనే?"

"మీరు చూస్తూ వుండండి. ఏం చేయాలో ఎట్లా చేయాలో నేను చెప్పుతాగా. అయితే పూర్ణిమా వాళ్ళంతా ఏ వూళ్ళో వుంటారో నీకేమైనా తెలుసా"

"ఆఁ ఎందుకు తెలియదు..........." అంటూ వారి వివరాలు తనకు తెలిసినంత వరకు చెప్పింది.

❦❦❦

ఆ రాత్రి పడుకున్న కుసుమకు తనను తాను సునంద ప్లేస్ లో వూహించుకుంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తనకు కూడా తల్లి,తండ్రి లేరు. ముందుముందు తనగతి కూడా అంతేనా అనిపించింది.

పొద్దున్నే తాతగారి పక్కన చేరింది.

"తాతయ్యా, నాకొక సమస్య వచ్చింది."

"ఏంట్రా అమ్మడూ?" తల నిమురుతూ అడిగాడు తాతయ్య. బామ్మ కూడా వచ్చి పక్కనే కూర్చున్నది.

"రేపొద్దున నేను పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిన తరువాత పండుగలని పురుళ్ళని నా మంచి చెడ్డలు ఎవరు చూస్తారు తాతయ్యా?"

ఆమెకు వచ్చిన అనుమానానికి బామ్మ తాతయ్యా ముందర తత్తర పడ్డారు. వెంటనే తేరుకొని, "ఎవరో ఎందుకు చూస్తారమ్మా, మేము వున్నంత కాలం మీ బామ్మా నేను చూసుకుంటాము. అయినా బాబాయిలు పిన్నమ్మలు నీకేమైనా తక్కువ చేస్తున్నారా? నీకెందుకు వచ్చిందమ్మా ఆ అనుమానం? ఎవరైనా ఏమైనా అన్నారా?"

పెద్ద వాళ్ళ కళ్ళల్లో తిరుగుతున్న కన్నీరు చూసి "అయ్యో, అదేం కాదు తాతయ్యా, సునంద పిన్నికి ఈ సమస్య వచ్చింది." అంటూ మొదలెట్టి అంతా చెప్పి, "పాపం పిన్ని. మనం ఏమైనా చేయగలమా?"

తాతయ్య కొద్దిసేపు ఆలోచించాడు. "అమ్మా, వాళ్ళ పర్సనల్ విషయంలో తల దూరుస్తున్నామని వాళ్ళు అనుకోకపోతే ఒక పని చేయవచ్చు."

"లేదు తాతయ్యా. పిన్ని దిగులు మర్చి పోవాలంటే వాళ్ళేమన్నా భయపడను. చెప్పు. ఏం చేద్దాం?"

"అయితే నేను ఈ విషయం శ్రీహరిగారితో కూడా మాట్లాడి ఏం చేయాలో చర్చించి నీకు చెప్పుతాను. సరేనా!"

❦❦❦

"అంకుల్, తాతయ్య మీతో ఏదో మాట్లాడాలిట. మీకు ఎప్పుడు వీలవుతుందో చెప్పితే ఆయన వస్తానన్నారు."

"పెద్దవారు ఆయనకు శ్రమ ఇవ్వటం దేనికమ్మా? నేనే రేపు సాయంత్రం మీ ఇంటికి వస్తానని చెప్పు తాతయ్యకు."

"ఏం జానకమ్మ పిన్నీ కోడలికి సీమంతం అంటున్నావు, వియ్యాలవారికి కబురేమన్నా చేసావా?"

"ఏమో నాయనా శ్రీహరీ, వాళ్ళ వాలకమేమో అర్థం కావటల్లేదు. పెళ్ళిచేసి అత్తారింటికి పంపిన వారు తాత నాయనమ్మ కాని బాబాయిలు కాని, మేనమామ కాని మళ్ళీ తిరిగి చూస్తే ఒట్టుపెట్టు. దానికి పుట్టింటి ప్రాప్తం అంతేనని సరి పెట్టుకున్నాలే. అసలు కబురెడదామనే అనుకున్నాను. ఏమో తీరాచేసి వాళ్ళేమైనా పుల్ల విరుపు మాటలంటే పీక్కోలేక లాక్కోలేక ఏడవాలి. శుభమా అంటూ శుభకార్యం ముందర ఏదైనా గొడవౌతుందేమో అని భయం అంతే." ఇన్నాళ్ళూ మధన పడుతున్న బాధనంతా వెళ్ళకక్కింది.

❦❦❦

సునంద సీమంతానికి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. జానకమ్మ హడావుడికి అంతే లేదు. వూళ్ళ నుండి పూర్ణిమ మేనత్తలు ఇద్దరు వాళ్ళవాళ్ళ కుటుంబాలతో వచ్చేసారు.

ముందు రోజు సీత సుధ ఇరుగింటికి పొరుగింటికి వెళ్ళి పేరంటం పిలిచి వచ్చారు. తరుణి ఇంటికి వచ్చి సుగుణకు తరుణికి బొట్టు పెట్టారు. "రేపు పొద్దున భోజనాలు మా ఇంట్లోనే. పొద్దున్నే ఇంట్లో ఎటువంటి వంటా పెట్టుకోమాక. మీకందరికి కూడా టిఫిన్లు కూడా చేయిస్తున్నాము. అవును సుగుణా ఎవరో చుట్టాలు వచ్చినట్టున్నారు!"

"అవును సీతా, మా బంధువులు వూరి నుండి వచ్చారు. నాలుగు రోజులు వుంటారు. అయినా టిఫిన్ల దగ్గరనుండి ఎందుకులెద్దూ. నేనొక్క దాన్ని భోజనానికి వస్తానులే. ఇంట్లో మగ వాళ్ళకూ బంధువులకు వంట చేసిపెట్టి వస్తాను."

"మంచి దానివేలే. అయినా మీ ఇంటికి బంధువులు వస్తే మా ఇంటికి వచ్చినట్టు కాదా ఏమిటి. ఏదీ వాళ్ళను పిలువు. వాళ్ళకు కూడా చెప్పే పోతాను. లేకపోతే మొహమాట పడుతారేమో."

"అబ్బెబ్బె అదేం వద్దులే. నే చెప్పి తీసుకొస్తాలే."

"ఏమే పిల్లా తరుణి, నీ ఫ్రెండ్స్ కుసుమ నాయనమ్మ తాతగారిని, రేణుక అమ్మ నాన్నను కూడా పిలిచి వచ్చాను. మళ్ళీ నా మాటగా నువ్వు కూడా ఒకసారి హెచ్చరించు."

"అట్లాగే పిన్నీ." ఆనందంగా తల వూపింది తరుణి.

"ఏంటో ఈ పిచ్చిపిల్లలు. సునంద అంటే వాళ్ళకు ఎంత ప్రేమో! దానికి సీమంతం అంటే వీళ్ళందరూ మహా సంబరపడి పోతున్నారు. నిన్న కుసుమ ఇంటికి వెళ్ళినప్పుడు అంతే. రేణుక ఇంటికి వెళ్ళినప్పుడు కూడా అంతే. వాళ్ళ మొహాలు చేటలంత వికసించాయి."

పాపం పిచ్చి వాళ్ళు పిల్లలు కాదు. ఈ తోడికోడళ్ళు. అమ్మాయిల ఆనందానికి కారణం వేరేవున్నదని తెలియని పిచ్చితల్లులు, అనుకొని తల్లి కూతుళ్ళు నవ్వుకున్నారు.

సాయంత్రం, "సునంద పిన్నీ, పదపద. నీ కోసం ప్రత్యేకించి అంత దూరం వెళ్ళి గోరింటాకు కోసుకొచ్చి చచ్చిచెడి రుబ్బుకొచ్చాను, ఇదిగో కాకర అకు కూడా తీసుకొచ్చాను. రా, మళ్ళీ అన్నం తినే లోపల కడిగేసుకోవచ్చు." హడావుడి చేసింది తరుణి.

"ఎక్కడికో వెళ్ళి కోసుకు రావటమేమిటే? మన పెరట్లోనే వుందిగా అంత పెద్ద చెట్టు?" సుధ పిన్ని అడిగింది.

"మన చెట్టు ఆకు అంత బాగా పండదు పిన్నీ. మా ఫ్రెండింట్లో చెట్టు ఆకు భలే ఎర్రగా అవుతుంది. మా పిన్ని బంగారు చేతులు ఎర్రగా పండాలి. ఏం పిన్నీ, అర్ధచంద్రుణ్ణి ఒక చేతిలో పెట్టి రెండో చేతిలో కాకర ఆకు పెట్టనా. మరి చేయి కదిలించకుండా పెట్టుకుంటే మంచి డిజైన్ వస్తుంది."

"ఎవరికే ఆ గోరింటాకు పిల్లా? సునందకా? మా మంచి దానివేలే. కడుపుతో వున్న పిల్లకు గోరింటాకు పెట్టితే ఆడపిల్ల పుడుతుంది. తెలుసా? ఆ రుబ్బిన ముద్ద మీరు ఆడపిల్లలు పెట్టుకోండి. దానికి వద్దు." జానకమ్మ వచ్చి అడ్డుకుంది.

"అబ్బా నాయనమ్మా, నీదంతా చాదస్తం అయినా ఆడపిల్ల పుడితే ఏం?"

"ఇంకా నయం కాదూ! తొలి సంతానం మగ పిల్లాడు పుడితేనే పెద్దయ్యాక కాలికి చేయికి అంది వస్తాడు. అయినా మీరందరు ముగ్గురు ఆడపిల్లలు తయారయినారుగా చాలదా." నవ్వుతూ ఆవిడ కూడా మనుమరాలితో హాస్యంగా అన్నది.

"అయినా నాయనమ్మా ఇప్పుడు ఏడవనెల కూడా నిండపోతున్నది. లోపల ఆడో మగో ఈ పాటికే రెడీగా వుంటుంది. అంతే కాని

గోరింటాకు పెట్టినంత మాత్రాన మగ పిల్లాడు అమాంతం ఆడపిల్లగా మారబోతున్నాడా?" రేణుక అందుకుంది.

"ఎవరే ఆ మాట అన్న బుడంకాయ. డాక్టరీలో చేరంగానే అన్నీ తెలిసినట్టే చెప్పుతున్నావే. అమ్మో నిన్నకాక మొన్న పుట్టిన పిల్లలు కూడా చెప్పేవాళ్ళే?"

ఆ విధంగా అమ్మాయిలు గోరింటాకు పెడతామని. ఆవిడ వద్దని. పెద్ద కోడలు కలుగచేసుకొని, "పోనీ లేండి అత్తయ్యా, పిల్లలు ముచ్చట పడుతున్నారు. ఆడైనా మగైనా ఈ రోజుల్లో ఒకటే. అయినా గోరింటాకు పెట్టుకున్నంత మాత్రాన రేణుక చెప్పినట్టు గర్భంలో వున్న పిల్లలు మారిపోతారా ఏమిటి? ఏదో లేత నెలలలో అయితే అది వేరే విషయం.

మా మరదలు ఇద్దరూ మగపిల్లలు పుట్టేటప్పటికి మూడవసారి కడుపుతో వున్నప్పుడు ఆడపిల్ల కావాలని నెలకొకసారి గోరింటాకు పెట్టుకుంది. ఏదీ. మళ్ళీ మగ పిల్లాడేగా."

ఆ మాటలతో విజయోత్సాహం వచ్చిన వీరుళ్ళలాగా నలుగురూ సునంద కాళ్ళూ చేతులూ పట్టుకొని అందంగా గోరింటాకు పెట్టేసారు.

పక్కింటికి వచ్చిన బంధువులు డాబా మీదనుంచి చూస్తూ మైమరచి పోయారు.

"నాయనా శ్రీహరి మా చిట్టితల్లిని ఇంత ఆనందమయమైన వాతావరణంలో చూపించావు. నీకు కృతజతలు ఏవిధంగా తెలపాలో తెలియటం లేదు." సుందరయ్య కళ్ళనీళ్ళతో శ్రీహరి చేతులు పట్టుకొని అంటుంటే అక్కడున్న అందరికి కళ్ళు చెమర్చాయి.

"బాబాయిగారూ అప్పుడే ఆనందమంతా వ్యక్తం చేస్తే ఎట్లా? రేపు మనుమరాలి కోసం కాస్త దాచుకోండి."

శ్రీహరి కుసుమ తాతగారితో మాట్లాడారు. "శ్రీహరి, నువ్వు చెప్పినట్టుగానే చేద్దాము. అమ్మాయిలు చెప్పిన మాటలు విన్నతరువాత జానకమ్మకు వియ్యాల వారి మీద ఏదైనా శతృత్వం వుందేమో అనిపించింది. కాని ఆవిడ అనుమానాలు అర్థమయ్యాయి కదా! శుభకార్యం ఇంక నాలుగురోజులకు వచ్చింది. రేపే మనిద్దరమూ వెళ్ళి పెద్దవాళ్ళతో మాట్లాడుదాము. మరి వాళ్ళ ఆలోచన ఏ విధంగా వుందో ఏమో, అది కూడా తెలుసుకోవాలి కదా!"

శ్రీహరి కార్లో ఇద్దరూ బయలుదేరారు. సునంద తాతగారు సుందరయ్యగారు ఆ వూళ్ళో బాగా పేరున్న మోతుబర్లు అవటాన ఇల్లు కనుక్కోవటం కష్టం కాలేదు.

కార్లో వచ్చిన అపరిచితులను చూసి అలవాటు ప్రకారం ఆహ్వానించి మంచి నీళ్ళు ఇప్పించి అడిగారు.

"మిమ్మల్ని నేనెరుగను. నాతో ఏదైనా పనిబడి వచ్చారా?" ఆయన నెమ్మదితనం మర్యాదా మన్ననా చూస్తే ఎంతో ఆత్మీయుడిలాగా కనిపించాడు.

"నా పేరు శ్రీహరి. వీరు కృష్ణారావుగారు. మేము హైద్రాబాదు నుండి వచ్చాము. మీ పెద్ద కొడుకు చిన్నతనానే పోయాడని విన్నాము. ఆయనకు సంతానం..........." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు.

కొడుకు మాట వినగానే ఆయన భార్య సావిత్రమ్మ బయటకు వచ్చి వారగా నిలబడ్డది.

"అవును బాబూ. వాడి భార్య పురిట్లోనే మరణించేటప్పటికి వాడు కూడా పిచ్చివాడిలాగా అయిపోయి భార్యతోటే వాడు కూడా..........."

"క్షమించాలి. పాత విషయాలు తిరగతోడి మిమ్మల్ని బాధించినట్టున్నాను. మరి అతని సంతానం......"

"వుంది నాయనా, ఒక్క కూతురు. ఏదో కొడుకు పోయిన దుఃఖంలో ఆ పిల్లను పట్టించుకోలేకపోయినాము. అట్లాగే పెరిగి పెద్దదయింది. ఎవరో పెద్దింటివాళ్ళు వచ్చి అమ్మాయిని వాళ్ళ అబ్బాయికి చేసుకుంటామని అడిగి మరీ చేసుకున్నారు. అది కూడా మాకు దూరమయిపోయింది. అత్తారింట్లో ఎట్లా వున్నదో ఏమో ఆ పిచ్చిది." ఆ మాటలంటూ సావిత్రమ్మ కళ్ళుతుడుచుకుంది.

"అయినా మీరెవరో మాకు తెలియదు. ఈ వివరాలన్నీ అడుగుతున్నారు. ఎందుకో తెలుసుకోవచ్చా?"

"అన్ని వివరంగా చెప్పుతాము. కాని కొన్ని సందేహాలను తీర్చుకున్న తరువాత."

ఈ లోగా సుందరయ్యగారి కొడుకులు కోడళ్ళు కూడా ఆసక్తిగా అక్కడకు రావటమే కాదు, వూళ్ళోని ఇతర పెద్దలు కూడా, "ఎవరే సావిత్రమ్మా! పొద్దున్నే ఎవరో చుట్టాలొచ్చినట్టున్నారూ." అంటూ  వచ్చి చేరారు.

"మరి అత్తారింటికి పంపిన మీ మనుమరాలిని చూడటానికి మీరెవ్వరూ ఎందుకు ప్రయత్నం చేయలేదు?"

"ఏమోనండి. ఆవిడ పాపం సానుభూతితో మా సునందను కోడలిని చేసుకోవటమే గొప్ప. మేమంతా తడవతడవకు వెళ్ళితే ఏమనుకుంటారోనని అమ్మనాన్న భయపడ్డారు. కాని ఇంట్లో ఏ అక్కర వచ్చినా సునందని తలుచుకోనివారుండరు." సుందరయ్యగారి కొడుకు అందుకొని చెప్పాడు.

"అమ్మో అది పిల్లటండీ. దేవత. ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చేది. వూరంతా తనే అయి కలియ తిరిగేది. అత్తారింట్లో ఏ అగచాట్లు పడుతున్నదో ఏమో!" పొరుగింటి ఇల్లాలు అన్నది.

"మరి అన్ని రకాలగా మనసులో అనుమానాలు పెట్టుకొని బాధలు పడేకన్నా, వాళ్ళ ఎడ్రెస్ మీకు తెలిసే వుంటుంది. ఒక్కసారి వెళ్ళిచూసిరావచ్చుకదా."

"ఏమోనండి. ఈ రోజుల్లో అత్తారిళ్ళు పూర్వంలాగా లేవు. ఏం చేస్తే ఏం తప్పో అన్న అనుమానం. సునంద కన్నా ఒక ఏడాది ముందర మా అక్కయ్య కూతురు పెళ్ళయింది. మీరన్నట్టే పెళ్ళయిన ఆరునెలలకు ఒకసారి అమ్మాయిని చూసొద్దామని మేము వెళ్ళాం. వెళ్తూ వట్టి చేతులతో ఎందుకని కొన్ని మిఠాయిలు పండ్లు పట్టుకెళ్ళాం.

అంతే అదొక పెద్ద తప్పిదంలాగా అత్తగారు, ఏం నాయనా మీ అమ్మాయికి సరిగ్గా అన్నం పెడుతున్నామో లేదో అనా పండ్లు మిఠాయిలు పట్టుకొచ్చారు.  ఇంట చాకిరీ చేయించుకుంటున్నామని అనుమానమా? చెప్పాపెట్టకుండా ఇట్లా వచ్చారు? అన్నది. దాంతో ఇంక సునంద ఇంట కూడా ఏమైనా తప్పు పడుతారేమోనని అటుకేసి చూడలేదు."

శ్రీహరి, కృష్ణారావుగారికి గుండెల మీదనుండి పెద్ద భారం దిగినట్టయింది.

ఇంక వచ్చిన అసలు విషయం బయట పెట్టారు.

"మీరు నన్ను పోల్చుకోలేదని తెలుస్తున్నది. నేను మీ వియ్యాలవారి  ఇంటి పక్కనే వుంటాను.  వీరు కూడా మాకు అత్యంత ఆత్మీయులు. మీ సునంద అత్తగారింట్లో చాల ఆనందంగా వున్నది. ఇంతకూ మేము ఇక్కడికొచ్చిన కారణం........."అంటూ అందరూ ఆతృతతో నిండిన మొహాలవంక చూస్తూ, "గోవిందయ్యగారూ, మీరు ముత్తాత అవబోతున్నారు."

"ఏమిటీ, సునంద తల్లి అవబోతున్నదా? ఏమేవ్ కాస్త పంచదార తీసుకురావే. ఇంత చల్లని వార్త తెచ్చిన ఈ అబ్బాయి గొంతులో పోయి." మాట వరసకు అన్నాడు అనుకొని నవ్వుకున్నారు కాని ఆవిడ లేచి లోపలికి వెళ్ళి గుప్పెడు పంచదార తెచ్చి శ్రీహరి నోట్లో పోసింది.

వాళ్ళ పిచ్చిప్రేమలు చూసి, అనవసరంగా ఇన్నాళ్ళూ అందరూ మధనపడ్డారే అని బాధపడ్డాడు.

ఇదంతా కమ్యూనికేషన్ గాప్ అని అర్థమయింది. ఇంక దాచి లాభం లేదని జానకమ్మ వ్యక్తపరచిన అనుమానాలు కూడా చెప్పేశాడు.

"ఇంక మనమంతా కలిసి చేయవలసిన ముఖ్య కార్యం ఒకటి వుంది. నాలుగు రోజులలో సునందకు సీమంతం చేయబోతున్నారు. సునందకు కాని వాళ్ళ ఇంట్లోని వారెవరికి కాని తెలియకుండా మీరు వచ్చి ఆశ్చర్యపరిస్తే ఎట్లా వుంటుంది?"

ఆ విధంగా అందరూ చర్చించుకొని ఆ ప్రకారమే రెండు రోజుల ముందరే వచ్చి శ్రీహరి ఇంట్లో మేడమీద గదుల్లో వున్నారు.

సాయంత్రం చల్లగాలి కోసం డాబా మీద కూర్చున్న సుందరయ్య సావిత్రమ్మకు కింద అమ్మాయిల హడావుడి అంతా కనిపిస్తూనే వుంది. మధ్యమధ్యలో జానకమ్మ వచ్చి కోడలి బుగ్గలు నిమిరి ముద్దుపెట్టుకోవటం, సునంద అత్తగారి చుట్టూ చేతులు వేసి గారాలు పోవటం, చూసిన వాళ్ళకు సునంద ఎంత ఆనందంగా వుందో, శ్రీహరి చెప్పింది చాల తక్కువ అనిపించింది.

"పూర్ణిమా, వెళ్ళి శ్రీహరి బాబాయిని సుగుణపిన్నిని భోజనాలకు రమ్మని చెప్పవే. ఆఁ మర్చేపోయాను. వారింటికి ఎవరో బంధువులు వచ్చారుట, నామాటగా చెప్పి వారిని కూడా రమ్మను. మళ్ళీ మొహమాట పడతారేమో."

స్నేహితురాళ్ళు కూడా ఈ గూడుపుఠాణీలో భాగస్వాములే. పొద్దున్న ఫలహారాలు పూర్ణిమ తరుణి మేడమీదకు తీసుకెళ్ళి వడ్డించి వారిని పలకరించి వచ్చారు.

"జానకమ్మ పిన్నీ మీ ఇంటికి చుట్టాలు వచ్చారు. ఆహ్వానించవా?" శ్రీహరి మాటలకు బయటకు వచ్చిన ఆడమగ నోటమాట లేకుండా నిలబడిపోయారు.

"ఎవరూ సుందరయ్య బాబాయి సావిత్రమ్మ పిన్నే రండిరండి. ఎన్నాళ్ళకు ఎన్నాళ్ళకు. భలే మంచి సమయానికే వచ్చారే. కాళ్ళు కడుక్కోండి. ఒరేయ్ పిల్లలూ తాతగారికి బామ్మగారికి కాళ్ళకు నీళ్ళు తేండే?"

ఎవరికి సమాధానం కూడా ఇవ్వటానికి ఆస్కారం లేకుండా ఆనందంతో గలగల మాట్లాడేస్తున్న జానకమ్మను చూస్తూ నవ్వుతూ వుండిపోయినారు, సుందరయ్య సావిత్రమ్మ, వారితో వచ్చిన శ్రీహరి దంపతులు, పూర్ణిమ తరుణిలు.

అందరితోపాటూ బయటికి వచ్చిన సునంద తనకళ్ళను తానే నమ్మలేకపోయింది."తాతయ్యా, నాయనమ్మా" అంటూ దగ్గరికి రాబోయి పక్కనే అత్తగారిని బావగార్లను తక్కిన పెద్దలను చూసి ఒక్క అడుగు వెనక్కి వేసింది.

"అదేంటే అక్కడే ఆగిపోయావు? పో దగ్గరికి వెళ్ళు. నాయనమ్మను, తాతయ్యను పలుకరించు." అంటూ అత్తగారు హెచ్చరించేటప్పటికి దగ్గరకు వెళ్ళిన మనుమరాలిని దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకున్నది సావిత్రమ్మ. "ఏమ్మా కులాసానా?" అంటూ తాతయ్య తల నిమిరాడు. మౌనంగా తల వూపింది. అంతకన్నా వాళ్ళ ముగ్గురికి మాటలే కరువయ్యాయి. ఏదైనా మాట్లాడాలన్నా ముందర కళ్ళల్లో నీళ్ళు వచ్చేటట్టున్నాయి. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టుగా వున్నది.

"నమస్కారం మామయ్యగారూ, అవునూ ఈ వేళప్పుడు ఏం బండి వుంది? ఏట్లా వచ్చారూ?" సుందరం అనుమానంగా అడిగాడు.

"అవునే అమ్మాయీ సుగుణ మీ ఇంటికి బంధువులు వచ్చారన్నారు, ఏరీ వాళ్ళు రాలేదే?" వాకిలి వంక తొంగి తొంగి చూస్తున్న జానకమ్మకు, తరుణి పూర్ణిమతో సహా అందరూ ముసిముసి నవ్వులు నవ్వుతూ కనిపించేటప్పటికి అనుమానం వచ్చింది.

"ఏమిట్రా, కొంపదీసి మీ ఇంటికి వచ్చిన బంధువులు వీళ్ళే కారు కదా! ఓరి మీ అసాధ్యం కూలా, ఇది ఎట్లా సాధ్యం రా, నాకేమీ అర్థం కావటల్లేదు." ఆవిడ బుగ్గలు నొక్కుకుంది. ఇంట్లో తక్కిన వాళ్ళు ఏమీ మాట్లాడకుండా చోద్యం చూస్తూ వుండిపోయారు.

"జానకమ్మ పిన్నీ, దీని వెనక చాల మంది కుట్రలే వున్నాయి. అయినా ఒక ముక్కలో చెప్పితే అయిపోయేది కాదు. ఆకళ్ళ

దంచేస్తున్నాయి. భోజనాల తరువాత కబుర్లు పెట్టుకుంటే కాదా?"

తాంబూలాలు వేసుకుంటూ జరిగిన విషయాలు ముచ్చటించుకున్నారు. "అమ్మా జానకమ్మా నీ చల్లని మనసు తెలియక అనవసరంగా అపార్థం చేసుకొని మా చిట్టితల్లిని దూరం చేసుకున్నాము. అయినా మాదెంత మూర్ఖత్వం. కళ్ళ ఎదురుగా బంగారమంటి పిల్లను పెట్టుకొని చచ్చిపోయిన కొడుకును తలచుకుంటూ దాన్ని నిర్లక్ష్యం చేసామే, అది ఇల్లు వదిలి వెళ్ళిం తర్వాత గాని అది లేని లోటు తెలిసి రాలేదు. ఇల్లంతా అదే కలియ తిరిగేది పిచ్చిపిల్ల. వంటింట్లో, వాకిట్లో, పెరట్లో అన్ని పనులు చక్కపెడుతూ గలగల తిరిగే పిల్ల ఇంట్లో వున్నన్నాళ్ళూ తెలియలేదు." అంటూ సావిత్రమ్మ చెమ్మగిల్లిన కళ్ళు వత్తుకుంటూ వుంటే,

"బామ్మగారూ, మరి మా ఇల్లు కళకళ్ళాడించవలసిన అదృష్టం మాకుంటే ఎల్లకాలం మీ ఇంట్లోనే పెట్టుకుంటే ఎట్లా?" అంటూ సీత హాస్యమాడేటప్పటికి కొద్దిగా మనసులు తేలిక పడ్డాయి.

సాయంత్రం అయిదయ్యేటప్పటికి ఆడపిల్లలు, సుధ సాయంతో సునందను సింగారించటంలో మునిగిపోయారు.

"అమ్మాయి సీతా, ఇవిగోనమ్మా సునందకు పెట్టాల్సిన చీర చలిమిడి మిఠాయిలు. ఇవిగో నీకు, సుధకు జానకమ్మకు, ఇంకా మీ ఆడబడుచులకు కూడా బట్టలు వున్నాయి. అన్ని ఒక పళ్ళెం ఇస్తే సర్ది పెడతాను."

"అయ్యో బామ్మగారూ, పెద్దవారు మీరెందుకు ఇంతశ్రమపడ్డారు? ఎట్లా అత్తయ్యగారు చేయిస్తూనే వున్నారు కదా, అవే పెట్టేస్తే సరిపోయేది కదా."

"వచ్చాను కాబట్టి తేగలిగాను. పెళ్ళి నాడు ఏం పెట్టామో ఏమో. ఆ భగవంతుడే శ్రీహరిని మాపాలిటి అపర నారాయణమూర్తి లాగా పంపించాడేమో ననుకుంటున్నాము. అతనే లేకపోతే మాకు ఈ అదృష్టం దక్కేనా?

సీతమ్మ తల్లీ, మీ తోడికోడళ్ళు అత్తగారు వంటి వాళ్ళు ఈ భూప్రపంచం మీద కనిపించరమ్మా. తల్లితండ్రులు లేని ఈ పిల్ల జీవితం ఎట్లా కడతేరుతుందా అని నేను మీ తాతయ్య ఆ రోజుల్లో తెగ దిగులు పడిపోయేవాళ్ళం. మా సునంద ఏ జన్మలోనో బంగారు పూలతో పూజ చేసి వుంటుంది."

"బామ్మగారూ! శుభకార్యం నాడు మీరట్లా మాటిమాటికి కంట తడిపెట్టకూడదు. పాపం పిచ్చితల్లి సునంద. ఇన్నాళ్ళూ మధ్యమధ్యలో దిగులు పడుతుంటే ఎందుకా అని తెలియలేదు. చూసారా! రక్త బంధం అంటే అదేనేమో! మీరొచ్చేటప్పటికి దానిమొహంలో మళ్ళీ పాత కళ హుషారూ వచ్చాయి."

"ఒసే సీతా అనుకుంటాము కాని వయసులో చిన్నవాళ్ళయినా ఈ అమ్మాయిలు వున్నావు చూసావూ, బుద్ధిలో మనకన్నా పెద్దవాళ్ళే. ఎంతలో ఎదిగిపోయారే? మనకు అసలు ఆలోచనే రాలేదు సుమా! అటువంటిది వీళ్ళు సునంద మనసులో బాధను కనిపెట్టారంటే వీళ్ళు సామాన్యులు కారే.

ఆ కుసుమను చూడరాదూ. మొన్నమొన్నటి దాకా చచ్చిపోయిన అమ్మనాన్నను తలుచుకుంటూ వాడిన మొహంతో వుండేది. అట్టాంటిది ఈ రోజు పెద్ద మొనగత్తె అయి తాతయ్య శ్రీహరి సహాయంతో ఇంత నాటకం ఆడించింది."

"నాయనా సీతారాముడు. ఇంతకాలం అనవసరమైన అపోహలతో మా చిట్టితల్లిని దూరంచేసుకున్నాము. అన్ని అవసరాలూ మీరే చూసుకుంటున్నారు. మేము వచ్చాము కనుక అమ్మాయిని ఆనవాయితీ ప్రకారం మా వూరు తీసుకెళ్ళి పురుడు పోసి మూడవ నెల మీ కోడలిని బిడ్డతో సహా దిగబెడుతాము." రాత్రి భోజనాలు కూడా అయిం తరువాత సుందరయ్య అడిగాడు.

అనుకోని ఈ ప్రతిపాదనకు ఎవరూ ఏమీ అనలేకపోయారు. ఆ వయో వృద్ధుల మాటలను కాదనలేరు. ఈ సమయంలో సునంద ప్రయాణం చేయటం, ఆ వూళ్ళో పురుడు అంటే అంత సబబు కాదేమోనన్న అనుమానం.

"అమ్మా ఏమంటావూ?" జానకమ్మ కూడా ఏమీ చెప్పలేకపోయింది.

ఆ సమయంలో కూడా శ్రీహరి బుర్రనే పాదరసంలా పనిచేసింది. "బాబాయిగారూ, ఈ వయసులో పిన్నిగారు అంత శ్రమ తట్టుకోలేరేమో. నేనొక ఐడియా చెప్పుతాను."

"మీరు మా ఇంటి నుండి కదా మీ వియ్యాలవారింటికి వచ్చింది?"

"అవును"

"అయితే మా ఇల్లు కూడా సునందకు పుట్టింటి కిందే లెక్క. అందుకని మాఇంటికే తీసుకొని వెళ్ళి నిద్ర చేయించి మళ్ళీ ఇక్కడే దిగబెట్టండి. అయినా నేను మధ్యలో కలుగ చేసుకుంటున్నానని అనుకోకపోతే........."

"ఎంత మాట నాయనా, నువ్వే కనుక కలుగ చేసుకోకపోతే మా చిట్టితల్లిని మేము చూడగలిగే వాళ్ళమా! నువ్వెట్లా చెప్పితే అట్లాగే చేయటానికి మేం సిద్దంగా వున్నాము. చెప్పు ఏం చేద్దామో?" సావిత్రమ్మ శ్రీహరి మీద పూర్తి నమ్మకంతో భారమంతా వేసి సలహా కోసం ఎదురుచూస్తున్నట్టుగా వుండిపోయింది.

"మీరా పెద్దవారయిపోయినారు. నేను గమనిస్తూనే వున్నాను. మీ మనుమరాలి మీద ఆపేక్షతో ఇంత దూరం వచ్చారు కాని ప్రయాణంలో మీరెంత అలిసి పోయినారో చూసాను. అటువంటిది సునంద పురిటి భాధ్యత మీ నెత్తిన వేసుకోవటం మీకు కాని ఆమెకు కాని అంత శ్రేయస్కరం కాదనిపిస్తున్నది.

కాబట్టి నేను చెప్పబోయేదేమిటంటే," అని ఆగి, "సీతారాముడూ, నీ తరపున కూడా నేనే చొరవ తీసుకొని చెప్పుతున్నాను. సుందరయ్యగారూ, సావిత్రమ్మగారూ సునంద పురుడు అయ్యేదాకా ఇక్కడే మా ఇంట్లోనే వుంటారు. మీ మనుమరాలి పురుడు పోసిన తృప్తి మీకుంటుంది. మీకు శ్రమ కూడా ఎక్కువ లేకుండా వుంటుంది. ఏమంటారు?"

కొంత తర్జనభర్జనల అనంతరం ఆయన ప్రతిపాదన అందరికి ఆమోదయోగ్యమయింది. కాకపోతే సుందరయ్య గారు మాత్రం, "నేను ఇప్పటి నుండే ఇక్కడ వుండిపోతే అక్కడ పొలాలూ కౌలు వ్యవహారాలూ ఇబ్బంది. నేను ఆ నాటికి మళ్ళీ వస్తాను. సునంద నాయనమ్మ ఇక్కడే వుంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు." భార్య వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

వూళ్ళో ఆయన బాగోగులు చూసుకోవటానికి కోడళ్ళు వున్నందున ఆవిడ కూడా ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments